ప్రకృతివనాల్లో పచ్చదనం కరువు

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఎండుతున్న మొక్కలు
- ప్రజాధనం వృథా


మండలంలోని పల్లె ప్రకృతివనం

ఆదిలాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేసింది. ఆయా గ్రామ శివారు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. వీటిని ఏర్పాటు చేసిన తర్వాత మొక్కలను సంరక్షించేందుకు పల్లె ప్రకృతివనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అయితే ఆ తర్వాత ప్రకృతివనాల నిర్వహణ కొరవడి మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

పర్యవేక్షణ కరువు..

మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామ పంచాయతీలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఆయా గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ. 6 లక్షల వరకు వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రకృతివనాల్లో మొక్కలు నాటడంతో పాటు నాటిన మొక్కలు పశువులు తినకుండా ఉండేందుకు కొన్ని చోట్ల పల్లె ప్రకృతి వనానికి కంచెలు సైతం ఏర్పాటు చేశారు. అయితే అనంతరం చాలా గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అంతేకాకుండా వేసవికాలం కావడంతో ఈ ఏడాది ఏన్నడూ లేని విధంగా వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రజలకు తాగేందుకు నీళ్లు దొరకడమే కష్టంగా మారింది. దీంతో పల్లె ప్రకృతివనాల్లోని మొక్కలకు నీరు పోయడం కష్టంగా మారింది. దీంతో పల్లె ప్రకృతి వనాలలోని మొక్కలు, చెట్లకు నీళ్లు పోయక ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

పర్యవేక్షణ బాధ్యత గ్రామ పంచాయతీలదే..



పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు వరకే మా బాధ్యత. గ్రామాలలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల పర్యవేక్షణ బాధ్యత గ్రామ పంచాయతీలదే. సంబంధిత గ్రామ పంచాయతీ సిబ్బందే వాటిని పరిరక్షించుకోవాలి. – జాకీర్ ఉస్సేన్, ఏపీవో, ఈజీఎస్, ఆదిలాబాద్‌రూరల్

బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారమే లక్ష్యం


వసతులు పరిశీలిస్తున్న విశారదన్ మహరాజ్

బజార్‌హత్నూర్: బడుగుబలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టామని ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ తెలిపారు. లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించారు. ఆసుపత్రిలో నీటి వసతి లేకపోవడంతో డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడారు. మిషన్‌భగీరథ ఏఈతో మాట్లాడి ఆసుపత్రిలో నల్ల కనెక్షన్ ఏర్పాటు చేయించారు. రోగులతో మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ భీంరావ్, శిల్పలతో కలిసి ప్రసూతి గది, ఫార్మగది, జనరల్ వార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై 10శాతం ఉన్న అగ్ర వర్ణాలు అధికారం చెలాయిస్తున్నాయన్నారు. అన్నెల లక్ష్మణ్, సర్కిల్ నరేశ్, రాకేశ్, ఆశన్న, డోగ్రే రాజు, హన్మంతు, రవి, రాజు తదితరులు ఉన్నారు.

త్వరలో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


అధికారులతో మాట్లాడుతున్న గోవర్ధన్ రెడ్డి

సాత్నాల: భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో త్వరలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు, నాయకులతో కలిసి బుధవారం పిప్పర్‌వాడ గ్రామంలో స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. మే 30లోగా కొనుగోళ్లు పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. వ్యవసాయ శాఖ అధికారి అష్రఫ్, పీఏసీఎస్ సీఈవో గంగన్న, సూపర్‌వైజర్ సుశీల్ కుమార్, మాజీ సర్పంచ్‌లు మహేందర్, ప్రభాకర్, సంతోష్ రెడ్డి, ప్రశాంత్, పోతరెడ్డి, గ్రామస్తులు ఊషరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలవాగులో 'పోలీసులు మీ కోసం'


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

సిరికొండ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం పాలవాగులో బుధవారం ఇచ్చోడ సీఐ రాజు ఆధ్వర్యంలో పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వాహించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీసాయి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి డయల్ 100, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యం, గుడుంబా, ట్రాఫిక్ నియమాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు.

రోడ్డుపై పశువుల సంచారం!


- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


ఇచ్చోడ ప్రధానరోడ్డుపై సంచరిస్తున్న పశువులు

ఇచ్చోడ: రోడ్లపై పశువులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చోడ ప్రధాన రోడ్లపై నిత్యం పదుల సంఖ్యలో పశువులు సంచరించడంతో పాటు రాత్రివేళ రోడ్లపైనే పడుకోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువుల వల్ల ద్విచక్రవాహనదారులు, ఫోర్‌వీలర్ వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. రోడ్లపై పశువుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

సిరికొండ: లైసెన్స్ కలిగిన సర్వేయర్లు శిక్షణ కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను 17వ తేదీలోగా సమర్పించాలన్నారు. లైసెన్స్ కలిగి ఉండి 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.





టాటూ.. అదిరేట్టూ..!

ఈ మధ్యకాలంలో టాటూ అనేది ఫ్యాషన్‌గా మారిపోయింది. ఎవరి చేతులపైన, భుజాలపైన శరీరంలో ప్రతీచోట టాటూలే కనిపిస్తున్నాయి. మగ, ఆడ అందరూ టాటూలు వేసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రత్యేకమైన టాటూలు వేసుకోవడానికి హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకే కాకుండా లండన్ సైతం పయనమవుతున్నారు. కొందరు తమ ఇష్టదైవాలను శరీరంపై వేసుకుంటుండగా, మరి కొందరు అమ్మనాన్నల ప్రేమకు గుర్తుగా వేయించుకుంటున్నారు

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్





పంట మార్పిడితో అధిక లాభాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

నేరడిగొండ: పంట మార్పిడితో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఏఆర్ఎస్ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్ అన్నారు. బుధవారం కుమారి గ్రామంలో గల రైతువేదికలో 'రైతుల ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం 'రైతుల ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే విషయాలను శాస్త్రవేత్తలు రైతులకు తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏ మోతాదులో ఎరువులు వాడాలి, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, సస్యరక్షణ చర్యలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్, నేరడిగొండ మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

సిరికొండ: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండలంలోని లచ్చింపూర్ (బి) గ్రామంలోని రైతు వేదికలో గురువారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రద్ధరాణి తెలిపారు. కార్యక్రమానికి వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ శ్రీధర్ చౌహన్, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

రైతులు నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏవో రమేశ్

ఇచ్చోడ: వానాకాలం సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలని ఇన్‌చార్జి ఏవో రమేశ్ రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో విక్రయించే విత్తనాలను రైతులు కొనుగోలు చేయొద్దన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు తీసుకోవాలన్నారు. డీలర్ల విత్తనాలు మొలకెత్తకపోవడం కానీ కాతపూత రాని సమయాల్లో రశీదులతో రైతులకు నష్టం జరగకుండా ఉంటుందన్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని, వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని రైతులను కోరారు. సమావేశంలో రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తలమడుగు: మే20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నాన్న కోరారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మెపోస్టర్ ఆవిష్కరించారు. కళావతి, రాధ, రమణ, పద్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో కార్మిక సంఘం నాయకులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘ స్వతంత్ర ఫౌండేషన్ అసోషియన్ పిలుపు మేరకు మే 20 నుంచి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు లక్ష్మణ్, సాయి, వినోద్, మచ్చ నర్సయ్య, గంగారాం, నాగన్న పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి వైద్యపరీక్షలు నిర్వహించాలి


ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

తాంసి: గ్రామాల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ వైద్యసిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని పొన్నారి గ్రామంలో తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలతో పాటు ఇతర పరీక్షలు చేయాలని వైద్యాధికారి శ్రావ్యకు సూచించారు. పొన్నారి గ్రామంలో 60 మందికి పరీక్షలు నిర్వహించగా 23 మంది రక్తనమునాలు పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. అనంతరం గిరిగాం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, వైద్యాధికారులు శ్రావ్య,నిఖిల్, సూపర్‌వైజర్ నగేశ్, వైద్య సిబ్బంది దీప, లక్ష్మి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

ఇచ్చోడ: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్ మండలాల ముఖ్య నాయకులు సమావేశం ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు క్షెంం నారాయణరెడ్డి తెలిపారు. సమావేశానికి టీపీసీసీ పరిశీలకులు ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీలు తాహేర్ బిన్ హాందాన్, చిట్ల సత్య నారాయణ వస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ ముఖ్యనాయకులు, అనుబంధ సంఘల నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేరడిగొండ: కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాలను గురువారం నిర్వహించనున్నట్లు పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాలకు సంబంధించి ఉదయం 9.30 గంటలకు రుయ్యాడి గ్రామంలో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, సోనాల మండలాలకు మధ్యాహ్నం ఒంటి గంటకు బోథ్ పట్టణ కేంద్రంలోని షాదీఖానాలో, ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్ మండలాలకు 3.30 గంటలకు ఇచ్చోడ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

విద్యార్థికి కలెక్టర్ ప్రశంస


అమృతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 560 మార్కులతో ప్రతిభ కనబరిచిన పిప్పర్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వగాడే అమృతను బుధవారం కలెక్టర్ రాజర్షిషా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అభినందించారు. లో విజన్ కేటగిరీలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం మంచి విషయమన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

నాసిరకం మొరం వాడొద్దు


రోడ్డు పనులు అడ్డుకుంటున్న నాయకులు

జైనథ్: బేల మండల సరిహద్దు నుంచి బోరజ్ మండలం వరకు అంతర్రాష్ట్ర రహదారుల పనులు కొనసాగుతున్నాయి. జైనథ్ మండల కేంద్రం వద్ద రోడ్డు పనుల్లో నాసిరకం మొరం వాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వాడకుండా మట్టి రాళ్లను వాడుతున్నారన్నారు. జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, నాయకులు హనుమంత్ రెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగన్నపేట గ్రామంలోని రైస్‌మిల్ వద్ద మహిళ సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. డీఆర్డీవో పీడీ రాథోడ్‌రవీందర్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ దూట రాజేశ్వర్, చంద్రయ్య, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై హర్షం


క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

సాత్నాల: మండలంలోని మేడిగూడ గ్రామంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మేడిగూడలో అధికారుల చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో పంట విక్రయించేందుకు మేడిగూడ, లక్ష్మీపూర్, పిప్పల్‌గావ్ గ్రామాల గుండా వ్యయప్రయాసలకోర్చి జైనథ్ మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. మేడిగూడలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో సంతోషంగా ఉందన్నారు.

క్లుప్తంగా

ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన


జోగు రామన్నను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్‌రూరల్: గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం మావల మండలంలోని దుబ్బగూడలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఉత్సవాలకు హాజరైన ఆయనను గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు యాస్కు నర్సింగరావ్, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, సంజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరవీరుడి కుటుంబానికి ఇల్లు మంజూరు


నిర్మాణం ప్రారంభిస్తున్న కుటుంబ సభ్యులు

నేరడిగొండ: ఇంద్రవెల్లి అమరవీరుడు బాపురావు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గుత్పాల గ్రామంలో గల స్థలంలో బుధవారం బాపురావు భార్య రూపబాయి చేతుల మీదుగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బోథ్ ఎంపీడీవో రమేశ్ బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. నాలుగు అంచెల్లో ప్రభుత్వం ఆర్థిక సాయం విడుదల చేస్తుందన్నారు. బిర్లాగొంది, నారాయణపూర్, అందూర్ గ్రామాల్లో తాగునీటి వనరులను పరిశీలించారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించాలని అధికారులకు ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9849390495లో సంప్రదించాలన్నారు.

ఇచ్చోడ సీఐగా బండారి రాజు

ఇచ్చోడ: ఇచ్చోడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బండారి రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ భీమేశ్ రామగుండం కమిషనరేట్‌గా బదిలీ కాగా వరంగల్ నుంచి బండారి రాజు ఇచ్చోడ సీఐగా బదిలీపై వచ్చారు. ఈమేరకు సీఐ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన శాంతి భద్రతల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ గ్రామ సమీపంలో గల మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఏఎస్సై రాథోడ్ మారుతి బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదిలాబాద్ పట్టణంలోని వరలక్ష్మీనగర్‌కు చెంది పుస్నాక్ శ్యాం, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని నిషాన్‌ఘాట్‌కు చెందిన ఆత్రం కిరణ్‌లు నిషాన్‌ఘాట్ నుంచి ఆదిలాబాద్ మీదుగా జందాపూర్ గ్రామానికి వెళ్తున్నారు. ఈక్రమంలో జందాపూర్ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

బోథ్: క్రాంతికారి హమాలీ లేబర్ కాంట్రాక్ట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం హమాలీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.శాలిక్ రావ్, ఉపాధ్యక్షుడిగా ఆడె విఠల్, ప్రధాన కార్యదర్శిగా అల్లుల సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేషన్ బియ్యం అమ్మితే కార్డు తొలగించాలి

ఆసిఫాబాద్‌రూరల్: రేషన్ బియ్యం అమ్ముకునే లబ్ధిదారుల కార్డులు రద్దు చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆర్డీవో లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు.